# పులకరించిన ప్రకృతి

వర్షం వెలిసింది. పల్లీయుల హృదయాలు పువ్వుల్లా విచ్చుకున్నాయి. రైతులు ఇళ్లల్లో వుండలేక నీళ్లలో కాళ్లీడ్చుకుంటూ ఉత్సాహంతో పొలాలకేసి, చెరువులకేసి బయలుదేరారు. చాలమంది మహిళలు ఇళ్లముందుకొచ్చేసి ప్రకృతి సౌందర్యాన్ని అవలోకిస్తూ ఆనందంతో వర్షం ఎలా ప్రారంభమై ఎలా కురిసిందీ, ఎలా అంతమైందీ అత్యుత్సాహంతో చెప్పుకొంటున్నారు. ఎన్ని దుక్కుల వర్షం పడివుండవచ్చునో ఎవరికి తోచినంత వారు అంచనా వేస్తున్నారు. పిల్లలు వీధిలో చేరి వర్షపు నీటితో ఆడుకొంటున్నారు. కొందరు కాగితపు పడవలు చేసి వదులుతున్నారు. కొందరు చిన్నచిన్న నీటి ప్రవాహాలకు బురదతో అడ్డకట్టలు కట్టి నీటి ప్రవాహాన్ని ఆపివేయడమో మరో దెసకు మళ్లించడమో చేస్తున్నారు. ఆనందంతో కేకలు వేస్తున్నారు. పాటలు పాడుతున్నారు. ఊరు వూరే ఆనంద తన్మయత్వంతో సెలయేటి ప్రవాహంవంటి జానపద గీతాన్ని ఆలాపించింది. వూరు వూరే పులకరించింది.

ఒక పలుచటి కుర్రవాడు పరుగుతో వచ్చి బిగ్గరగా కేకలు వేశాడు—

"ఏరొచ్చేసింది. పైవంక మొరమొరమని సాగివచ్చేస్తోంది. రండి...అందరూ రండిరా...ఏటి ఒరవడి చెప్పడానికి వల్లకాకుండా వుంది. రండిరోయ్".

పిల్లలు, పెద్దలు, స్త్రీలు, ముసలివాళ్లు పరుగు లంకించుకున్నారు. వరదలా మనుష్యులు బహు సందడితో ఏటికేసి సాగేరు.

ఊరు ప్రక్కగా, ఊరి చివర్న ఏరులోకి దిగే మెట్రాళ్ల వద్ద జనం గుంపులు గుంపులుగా చేరిపోయారు. ప్రవాహంలో మొగిలి పొదలు వగైరాలు గుట్టలు గుట్టలుగా కొట్టుకొని వస్తూవుంటే జనం మిక్కిలి ఉత్సాహంతో, ఉద్వేగంతో "ఏహేయ్ హోయ్...ఏహేయ్ హేయ్..." అని కేకలు వేస్తున్నారు.

సాహసవంతులైన కొందరు యువకులు ఏట్లో దిగి ఆవలిగట్టు చేరడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఒకరి భుజా లొకరు పట్టుకొని ముందుకు ఒక్కో అడుగే వేస్తున్నారు. మీదినుంచి బ్రహ్మాండమైన ప్రవాహ మొస్తున్నప్పుడు కుర్రవాళ్లిలా వెర్రి సాహసంతో ఏటిలో దిగడం ప్రమాదకరమని పెద్దలు హెచ్చరిస్తూనే వున్నారు. తిరిగి రమ్మని ఆ యువకుల తల్లులు, అక్కలు పేరు పేరునా పిలుస్తూ కేకలు వేస్తున్నారు. బయలుదేరుతున్న వారిని బలవంతంగా ఆపి నొక్కేస్తున్నారు. ఎంతచెప్పినా వినని వాళ్లను చీవాట్లు పెట్టి తన్ని వెనక్కి లాగుతున్నారు.

ఆ సంరంభాన్ని వర్ణించలేం. అది అనుభవైకవేద్యం.

ఆడవాళ్లు ఇళ్లకువెళ్లి పసుపునీళ్లు, పూజా ద్రవ్యాలు కొబ్బరికాయలు తెచ్చి గంగమ్మ తల్లికి సంతోషంతో పూజలు

చేసి కానుకలు సమర్పించుకొంటున్నారు. ఇద్దరప్పుడే రెండు మంచి బలమైన పొట్టేళ్ళను 'మెట్రాళ్ల' వద్ద బలి యిచ్చేశారు.

హఠాత్తుగా పైనుంచి ప్రవాహం వచ్చి కలిసి హోరుమని ఒకటే రొదచేస్తూ ముందుకు సాగింది. ఏటిమధ్యవున్న యువకులు ప్రవాహంలో కొట్టుకొని పోయారు. గట్టుమీద జనం బిగ్గరగా కేకలువేసి చప్పట్లు చరిచారు.

కొట్టుకుపోయిన యువకులలో ఒకరు తప్పించి మిగిలిన అందరూ ఫర్లాంగు దూరంలో కష్టపడి గట్టుకొచ్చేశారు. మిగిలిన అబ్బాయి పత్తా లేదు. ఆ అబ్బాయి అమ్మా, అక్కా, బావా బంధువులు గోల పెట్టారు. గట్టువెంబడి పరుగులు తీశారు. గంట సేపటికి కూడా అతని జాడ కనిపించ లేదు. గుండెలు బాదుకొని ఏడుస్తూ, అరుస్తూ అతణ్ణి ప్రోత్సహించిన తోటి యువకుల్ని శపిస్తూ ఇల్లు చేరుకున్నారు.

మర్నాడు ఆ అబ్బాయి శవం ఎనిమిదిమైళ్ల దూరాన కనిపించింది.

"అది అంతే! ఇట్లా ఉధృతంగా ఏరొచ్చినప్పుడల్లా ప్రతి తడవా గంగమ్మతల్లి ఒక ప్రాణాన్ని బలిగా తీసుకొంటున్నదని" మూఢులైన ముసలివాళ్లు వ్యాఖ్యానం చేశారు.

★

ఆ అబ్బాయి నాన్న కేశవయ్య ఏరొచ్చే ముందే చెరువు నిండిందేమో చూడటానికి ఏరవతలకు వెళ్లాడు. ఆ రాత్రంతా ఏరు అలా సాగింది. వంతెన లేకపోవడంచేత ఇవతలికి రావడానికి వీల్లేక తిండీ నీళ్ళూలేక, ఆవలిగట్టునే వుండిపోవలసి వచ్చింది. ఉదయం ఏరు దాటగానే పెద్దకొడుకు చేతికందినవాడు ఇప్పుడిప్పుడే వ్యవసాయంలో ప్రవేశించి తనకు తోడుగావున్నవాడు వరదలో

పోయాడనేసరికి చెరువు నిండిన సంతోషపు పొంగు నుంచి ఒక్కసారి జారి కరిగిపోయి, గుండే చెరువై పోయి, దుఃఖంతో కృంగి పోయాడు. అతనికిక ప్రపంచం కనిపించలేదు. ఆ కుటుంబం అన్ని ఆశలూ అతని మీదే పెట్టుకుంది. ఆ అబ్బాయి పోవడంతో ఆ కుటుంబం దుఃఖ ప్రవాహంలో నిలిచి గిలగిల తన్నుకొంది.

★

వాళ్లు దుఃఖంనుంచి కోలుకోక ముందే వూళ్ళో అందరూ పొలం పనులు ప్రారంభించేశారు. ఎన్నో ఏళ్లు వర్షాలు లేక కరువులో పడి ప్రజ మలమల మాడిపోయిన తర్వాత అదే మొదటివర్షం. రైతులు ఉత్సాహంతో వరిపైరు నాటడంకోసం మళ్లు దున్నుతున్నారు. విత్తనాలు వదులుతున్నారు. కరువులో ఎడ్లూ అన్నీ అమ్మి ఎర్రజొన్నలుకొని తినేసిన కొందరు రైతులు, ఇప్పుడు సేద్యం ఎలా సాగించాలో తోచక దిగులుపడిపోయారు.

కేశవయ్య ఆ రకం మనిషి. మడి దున్నడానికి ఎద్దులులేవు. మడక లేదు. విత్తనాలు లేవు. ఒక్క వ్యవసాయ పనిముట్టు లేదు. అన్నీ కరువులో 'అయినకాడికి అమ్మేసి' జొన్నలు...చవీసారం లేని ఎర్రజొన్నలు వగైరా కొనితిని ప్రాణాలు నిలుపుకొన్నారు. పస్తులతో, అర్ధ తిళ్లతో సత్తువలేని పదార్థాలు తిని శరీరంలో జవసత్వా లుడిగి పోయాయి. వేడిరక్తంతో పొంగిపోతూవున్న పెద్దకొడుకు వరదలో పోయాడు. ఏమీ తోచక మోకాళ్లు దగ్గరచేర్చి చేతులతో చుట్టుకొని మీద తలచేర్చి మూల కూర్చున్నాడు కేశవయ్య.

"జరిగినదేదో జరిగిపోయింది. ఇంక జరగవలసిన పను లేవో చూడ"మని చెప్పడానికి ఆ యింట్లో అంతకన్న గుండె నిబ్బరం వున్నవారు లేనేలేరు.

మంచివర్షం కురిసి ఏరాళంగా నీరు ప్రవహిస్తున్నా ఇంకా పొలం పనులు మొదలు పెట్టక అల్లుడు కొడుకు పోయిన దుఃఖంతో మూలకూర్చున్నాడని మామగారికి తెలిసింది. ఆయన ఒకసారి వచ్చి ధైర్యంచెప్పి వెళ్లిపోయాడు. కేశవయ్య కొంత బలం కూడదీసుకొని పైకి లేచాడే గాని లేచింతర్వాత ఏం చేయాలో మాత్రం బోధపడనే లేదు.

పొలంలో, మామిడితోటలో వుండిన చెట్లన్నీకొట్టి కరువులో బొగ్గులు కాల్పించి డబ్బుచేసుకొన్నారు. మడక్కొయ్యకు పనికివచ్చే ప్రతి మొక్కనూ నరకి పారేశారు. దూరంలో వున్న అడవికి వెళ్లినా కొయ్య దొరుకుతుందనే నమ్మకంలేదు. అక్కడ అంతా బొగ్గులకోసం కాల్చేశారు. అంచేత మామగారి ఊరుకు వెళ్లి అక్కణ్నుంచి ఎలాగో రెండుకొయ్యలు తెచ్చుకోవచ్చ ననుకొన్నాడు. ఇక ఎద్లు, విత్తులు ఎలాగ?

ఏమి అమ్ముకొనడానికీ ఇక ఇంట్లో ఏమీ మిగలి లేదు. కరువులో సర్వసామగ్రీ హరించుకుపోయింది. పైగా రెండువేల రూపాయల అప్పు మిగిలిపోయింది.

ఒకసాయంకాలంపూట నిస్పృహతో అరుగుమీద కూర్చుని ఆలోచిస్తున్నాడు కేశవయ్య. భార్య సుందరమ్మ, మొహాన ఆశారేఖలతో దగ్గరగా వచ్చి కూర్చుని చెప్పింది:

"దానికెందుకంత వ్యసనపడతావు! కరణం రామయ్య అందరికీ అప్పులిస్తున్నాడు. రూపాయకు నెలకు రెండణాలు వడ్డీ చొప్పున ఇస్తున్నాడట. నయమే కదా! కరువులో రోజుకు రూపాయకు అర్ధణావడ్డీ యిస్తిమి కదా! కరణందగ్గర ఇప్పుడు కాడిఎద్దులు కొనడానికి మాత్రం డబ్బుతెచ్చి పంట వచ్చిన తర్వాత వడ్డీతో తీర్చేయలేమా?"

ఈ మాటలు కేశవయ్యకు అట్టే వుషారు యివ్వలేదు. కరువులో విషయం వేరు. అప్పుడు తిండిగింజలకోసం ఒకోసారి పదీ లేదా ఇరవై రూపాయలు అప్పుచేసేవారు. ఇప్పుడు కనీసం ఆరువందల రూపాయలు కావాలి. రూపాయకు నెలకు రెండణాలు లెక్కన అప్పు తెస్తే పంట వచ్చేసరికి ఆరువందలు కాస్తా దాదాపు వెయ్యి రూపాయలై పోతుంది. ఎంత తక్కువ కాలంలో పండే వరివేసినా గింజలు ఇంటికొచ్చే సరికి నాలుగు నెలలై పోతుంది. ఈ లోగా ఇంట్లో తినడానికి, కూలీలకు, ఎద్దులకు, ఎరువులకు, విత్తనాలకు, బోలెడు ఖర్చవు తుంది. ఇంతా చేస్తే పండించింది అంతా అప్పుకు సరిపోతుంది. మళ్లా పంట వచ్చేవరకు తినడానికి గింజలైనా మిగలవు. ఇలాంటి వ్యవసాయం చేసినా ఒకటే చేయక నట్టింట్లో పడుకొన్నా ఒకటే. అయినా చేయక తప్పదు మరి! ఊరికే కూర్చోవడం రైతు తత్వానికే విరుద్ధమైనది. వ్యాపారిలాగా లాభ నష్టాలను లెక్కించు కొని చూస్తూ కూర్చుంటే జనం పనికి మాలిన వాడి క్రింద జమకట్టి పారేస్తారు.

కరణం కరువు రోజుల్లో రైతులకు ప్రభుత్వం నుంచి అప్పు లిప్పించి మామూళ్లు తీసి చాల ఆర్జించాడు. ఆ రైతుల డబ్బునే మళ్లా రైతులలో వడ్డీకి తిప్పుతున్నాడు. కేశవయ్యకు ఇక వేరే దారి కనిపించక కరణం రామయ్య దగ్గర బేరంచేసి నెలకు రూపా యకు అణాన్నర వడ్డీలెక్కన డబ్బు తెచ్చాడు. ఎద్దులు విత్త నాలు వగైరా కొని వ్యవసాయం ప్రారంభించాడు. మడి దున్ని నారు వదిలాడు. నారు వచ్చిం తర్వాత నాటించాడు.

మంచి ఎరువూ ఆకూ వేయటంచేత, కొన్ని యేళ్లుగా పొలం బీటలువారి ఆరివుండటంచేత ఇప్పుడు పైరు బాగా

పుంజుకొంది. నవనవ లాడుతూ ఆరోగ్యంతో ఏపుగా పెరగ సాగింది. ఒక పక్క పైరు పెరుగుతూవుంటే, మరోపక్క అప్పులు, వడ్డీలు పెరుగుతూ వస్తున్నాయి కేశవయ్యకు.

కేశవయ్య కుంట క్రింద వరిపైరు కోత కొచ్చింది. పండిన వరిపైరు బంగారు రంగుతో, బరువుతో వూగిపోతోంది. కళ్యాణమంటపంలో పల్లెటూరి పెళ్ళికూతురు లజ్జా భారంతో వంగినట్లు, పైరంతా గింజల బరువుతో వంగిపోయి, పెళ్లికొడుకు హృదయంలో ఆనందంలాగే కేశవయ్య మనసులో భవిష్యత్తు పట్ల పెద్ద ఆశ కలిగించింది.

ముదురురంగు చీరలవంటి మేఘాలు, సూర్యకాంతితో మెరుగులు పెట్టబడిన కొత్త శోభలు, వింత శోభలు లేనట్టి బరువైన మేఘాలు, ఆకాశాన్ని కమ్ముకొన్నాయి. సూర్యుడు మబ్బుల్లో పూర్తిగా కప్పబడి ఆ వెచ్చని, చల్లని వాతావరణంలో మైమరచాడు.

భూతలంమీద మనుష్యులలో కదలిక కలిగింది. రైతులలో ఆందోళన రేకెత్తింది. వాన వచ్చే సూచనలు కనిపించగానే ఆనందంతో పొంగిపోయే రైతులు ఈసారి వ్యాకులపడుతున్నారు. బలమైన వర్షం కురిస్తే పంటలన్నీ నాశన మైపోతాయి. ఇంకో ఇరవై రోజులు వర్షం లేకుంటే పంటలన్నీ కోతలై పోతాయి. అప్పుడు వర్షమొస్తే మంచి ప్రయోజన ముంటుంది. ఇప్పుడు చినుకు క్రిందపడితే గింజలన్నీ రాలిపోతాయి.

చినుకులు ప్రారంభమయ్యాయి. చివికి చివికి గాలివాన అయింది. ఆఖర్న కుంభవృష్టిగా పరిణమించింది. ప్రకృతి పులకరింపు 'దారుణ దావానలం' వంటి దుర్వృష్టి అయింది. అది ఆ ప్రాంత ప్రజలు గత ఇరవై ఏళ్ల లోపున కనీ వినీ ఎరగని కుంభవృష్టి.

ఏరులూ, వాగులూ వర్షపునీటి ప్రవాహాలతో హోరెత్తాయి. పంట పొలాలమీద, తోటలమీద, పాపాలన్నీ తనలో కరిగించుకొన్నట్లు ఎఱ్ఱని నల్లని నీరు పారుతోంది. ఆ ధాటికి తోటలలో పూతాపిందే రాలిపోయాయి. వృక్షాలు కూలిపోయాయి. చెరువుగట్లు తెగి పంట పొలాలను సర్వనాశనం చేశాయి. పొట్ట కఱ్ఱలతోను, కోతకొచ్చిన స్థితిలోనూ వున్న వరిపొలాలు...వాగులో మట్టితో కలిసిపోయాయి.

ఆ వర్షపు హోరులో కేశవయ్య తన పొలంకేసి పరుగు తీశాడు. కుంటకు గండి పడింది. గండి పూడ్చకపోతే, కుంట క్రింది తన ఒక్కడి పొలాలే కాదు, అందరివీ నాశనమైపోతాయి. కేశవయ్య సాహసించాడు. రాళ్ళూ, రప్పలూ, తెచ్చి గండి పూడ్చటం ప్రారంభించాడు. మీద వర్షం తలబ్రద్ద లయ్యేలా కురుస్తోంది. బురదలో కాళ్లు జారుతున్నాయి. అయినా లెక్క చేయలేదు.

కేశవయ్య శ్రమ ఫలించలేదు. కట్ట తెగింది. కుంటలో నీళ్లు మహావేగంతో ముందు కురికాయి. కేశవయ్య ఆ ధాటికి ఆగలేక జారిపోయాడు. పై నుంచి వచ్చిపడుతున్న నీటి ఒరవడితో గట్టు తెగినచోట వేగం హెచ్చింది. కేశవయ్య, బలహీనుడైన కేశవయ్య, ఇసుకలో రాళ్లక్రింద, చెత్తక్రింద కూరుకుకొని పోయాడు. అతని ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది.

మర్నాడు ఉదయం కరణం రామయ్య కేశవయ్య మూఢత్వానికి బహిరంగంగా విచారించాడు. ఇక కేశవయ్య పొలాన్ని తనది చేసుకోడానికి పథకం సిద్ధం చేసుకొన్నాడు.

---